# నీవే దైవము!

**దేవుడెక్కడనుచు దేవులాడగనేల!**
**హృదయమందు లేడె ఈశ్వరుండు**
**ఇచ్చుకొనుము సేవ పుచ్చుకొనుము ప్రేమ**
**అటుల దైవతత్త్వమరయ రండి.**

విద్యార్థులారా!

'విద్యా దదాతి వినయం' అన్నారు అనగా విద్యయొక్క లక్ష్యము వినయము. వినయ ప్రధానమైనది విద్య. వినయమనగా కేవలము చేతులు కట్టుకొని, తల వంచుకొని ఉండటము మాత్రమే కాదు. అహంకార, మమకారరహితమైన చర్యలే వినయము. నిత్యజీవితమందు అహంకార, మమకారరహిత చర్యలయందు జీవితము గడిపినప్పుడే అతను సరియైన విద్యావంతుడు కాగలడు.

**విద్య నేర్చితినంచు విఱ్ఱవీగబోకు**
**తెలివితేటలున్నవటంచు తిరుగబోకు**
**చదువులన్నియు చదివి చాలవివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను**
**హీనుడవగుణంబు మానలేడు.**

**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానంబెపుడు పొందలేదు**
**చదువు చదివి చదివి చావంగ నేటికి**
**చావులేని చదువు చదవవలయు.**

sri sathyasai vachanamrutam

ఇదియే భగవద్గీతయందు 'అధ్యాత్మవిద్యా విద్యానాం' అని చెప్పబడింది. ఆ 'అధ్యాత్మవిద్యయే నేను' అన్నాడు గీతాచార్యుడు. ఈనాటి విద్యలన్నీ ప్రాకృతమైన విద్యలు. ఇవన్నీ Bookish knowledge. కానీ అధ్యాత్మవిద్య Practical knowledge. ఈనాటి విద్యలన్నీ భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన, అనిత్యమైన, అశాశ్వతమైన, అసత్యమైన విద్యలే! దీనిని విద్య అని చెప్పటము సరియైనది కాదు. ఏది జ్ఞానమును కలిగించునో అదియే విద్య. 'విత్' అనగా తెలుసుకోవటం. ఏది? దేనిని? య-ఏది జ్ఞానమును కలిగించునో దానిని తెలుసుకోవటమే విద్య. విద్యాస్వరూపుడైనవాడు భగవంతుడు. భగవంతుడు ప్రత్యేకంగాలేడు. మీరందరు భగవత్స్వరూపులే! Why do we need God అని కొందరు ప్రశ్నిస్తారు.. యిది చాలా అర్థరహితమైనది. నీవు దైవాన్ని కావాలని కోరనక్కరలేదు, నీవే దైవము. దీనికి నా ప్రశ్న ఏమంటే, నిన్ను నీవు ఎందుకు ఆశిస్తున్నావు? Why do you need yourself? You are God, God is not seperate from you; in you, with you, above you. You are God. ఈ సత్యమును తెల్పేదే ఆధ్యాత్మిక విద్య. ఈ ఆధ్యాత్మికము ఎక్కడ అభివృద్ధి అవుతుంది?

### ప్రతి మానవునియందు దైవత్వము అనే మంచితనము ఉంటున్నాది

విద్యార్థులారా! ఒక విత్తనము తీసుకవచ్చి టిన్నులో పెట్టి నీరుపోస్తే అది కుళ్లిపోతుంది. మొక్కరాదు. అదే విధముగా ఆధ్యాత్మికమునందు ప్రేమ బీజమును నాటినప్పుడే అది గొప్ప విశ్వమనే వృక్షముగా రూపొంది ఆనందమనే ఫలము మనకందిస్తుంది. ఆధ్యాత్మికరహితమైన భూమియందు ఈ విత్తనము నాటినప్పుడు ఏమాత్రము అభివృద్ధికాదు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నారు. ప్రతిదానికి సాధన చేయాలి. Walking, reading, talking, eating, writing ఇవన్నీ practice తో వస్తాయి. అమ్మ నేర్పుతుంది. 'నాయనా! అమ్మ, అప్ప', అని నేర్పుతుంది. యివన్నీ ప్రాక్టీసువల్ల వచ్చేవి. దీనినే గీత 'శ్రేయోహిజ్ఞానమభ్యాసాత్' మనకు శాంతి కావాలనుకున్నాం. అభ్యాసము చేయి మొదలు. మీరు యిక్కడ కూర్చున్నారు, పద్మాసనం వేసుకొని. పద్మాసనము వేసుకొని కూర్చోటం అలవాటే లేకపోతే, అభ్యాసమే లేకపోతే, మీరు కూర్చోలేరు. కూర్చోటంకూడా

srisathyasaivachanamrutam

ఒక ప్రాక్టీసే! జీవితమంతా ఒక ప్రాక్టీసు. చిన్న డ్రామా వేయాలంటే పదిదినములు ముందుగానే ప్రాక్టీసు చేస్తూంటారు. కాబట్టి World is like a stage, all are actors, God is director. దీనికంతా ప్రాక్టీసు కావాలి. దైవత్వము ఆధ్యాత్మికమునందు మాత్రమే అలవడుతుంది. ప్రతి మానవునియందు మంచితనము అనేది ఉన్నది. మంచితనమే జ్ఞానాగ్ని. ఆ అగ్నిపైన మన లక్ష్యమును విస్మరించి దానిని మరచిపోవటంచేత అగ్ని నివురు కప్పుతున్నాది. ఈ ash ఎక్కడనుంచి వచ్చింది? అగ్నినుంచే వచ్చింది. అగ్నినుంచి వచ్చిన నివురు అగ్నినే కప్పివేసింది. కాబట్టి, మనయందున్న మంచితనమును ఏది కప్పివేస్తున్నాది? రాగ, ద్వేష, అహంకారములు అనే అగ్నినుంచి వచ్చిన నివురు కప్పివేస్తున్నాది. ప్రతివ్యక్తియందు మంచితనము ఉంటున్నది. దీనినే ప్లేటో మూడు పదములు చెప్పాడు. Truth, goodness and beauty. దీనినే భారతీయ ఉపనిషత్తులందు 'సత్యం, శివం, సుందరం' అన్నారు. ప్రతి మానవునియందు దైవత్వమనే మంచితనము ఉంటున్నాది. ఈ మంచితనములేని మానవుడు జగత్తులో లేడు. కానీ ఆ మంచితనమును రాగద్వేషములు కప్పివేస్తున్నాయి. ఫలితంగా ఆ దైవత్వమును మనం గుర్తించుకోలేకపోతున్నాము. అట్టి దైవత్వమును గుర్తించుకోవాలనుకున్నప్పుడు ఈ కప్పుకున్న అహంకారము, రాగము, ద్వేషము, యిత్యాది ధూళిని మనము దూరము చేయాలి.

**తనను తాను వెతుక్కునేవాడు మూర్ఖుడే!**

విద్యార్థులారా! ఆధ్యాత్మికమంత సులభమైన మార్గము మరొకటిలేదు. ఇంతకంటె సులభమైనది లోకములో ఎక్కడా కనిపించదు. ఈ గులాబి పుష్పమును నలపటం కొంచెం కష్టము కావచ్చు. కానీ ఆధ్యాత్మికమును అర్థం చేసుకోటం అంతకంటె సులభం. కారణం ఏమిటి? తనయందే ఉన్నది ఇక బయట వెతుకనక్కరలేదు. అన్వేషణ అనవసరం. అయితే ఎట్లా దీన్ని వెతకాలి? ఎక్కడో బయట ఉంటేకదా నీవు వెతకాలి. ఇది బయటలేదు. తనయందే ఉన్నది తానుగానే ఉన్నాడు.

విద్యార్థులారా! మిమ్మల్ని మీరు ఎక్కడైనా బయట తట్టు వెతుక్కుంటారా? తనను తాను ఎవరూ వెతుక్కోరు. తనను తాను వెతుక్కునేవాడు మూర్ఖుడనే చెప్పవచ్చు. కాబట్టి, నీవే

srisathyasaivachanamrutam

దైవమై ఉన్నావు. దానిని మూడు పదములతో వైస్‌చాన్సలర్ చెప్పాడు, you are god అని. జీవాత్మ, పరమాత్మల గురించి రామకృష్ణ పరమహంస చెప్పాడని ఒక కొటేషన్ చెప్పాడు. కానీ, నా ఉద్దేశ్యము మరొకటి. అహందేహాత్మ, అహం జీవాత్మ, అహం పరమాత్మ. 'అహం దేహాత్మ' ఆ దేహాత్మను నేను అనుకోటం అజ్ఞానము. యిదే ద్వైతము. 'అహం జీవాత్మ', యిది విశిష్టాద్వైతము. 'అహం పరమాత్మ', యిది అద్వైతము. అహం దేహాత్మ the one you think you are, అహం జీవాత్మ the one others think you are, అహం పరమాత్మ the one you really are. ఈ తత్త్వము మనం చక్కగా అర్థం చేసుకున్నప్పుడు 'దేహ ఆత్మ, జీవ ఆత్మ, పరం ఆత్మ'. దేహం, జీవం, పరం మూడు వేరైపోయినాయి. ఆత్మ, ఆత్మ, ఆత్మ ఒక్కటే అయిపోయింది. దీనినే గాయత్రీమంత్రమందు 'ఓం భూర్భువస్సువః' అన్నారు. భూర్-భూలోకము ఏమిటి భూలోకమంటే అంతా పదార్థమయమైనది. అదే శరీరము, materialisation. భువః-ఈ శరీరమును అడిస్తున్నాది, అదే జీవతత్వము. అదే vibration. ఈ vibaration వలననే దేహము సంచరిస్తున్నాది. శరీరము-materialsation, జీవుడు-vibration, ఆత్మ-radiation. ఈ మూడు మనయందే ఉంటున్నాయి. ఇంకెక్కడ నీవు వెతికేది? ఎందుకు వెతకాలి? ఈ సత్యము నీవు గుర్తించుకుంటే సర్వము నీవే అయిపోతావు.

## భగవంతుడొక్కడే అనాథుడు

కబీరు బీదవాడు. బట్టలు నేసి పదిమందికి అన్నం పెట్టి తాను తినేవాడు. ఎప్పుడు చూచినా 'రాంరాంరాం' అని నేసేవాడు నేతపని. ఈ నామముతో నేసిన వస్త్రమునకు ఎంతో విలువ ఉండేది. కానీ తాను లాభంకోసం ఏమాత్రం కాచుకోలేదు. దానికి ఎంత ధరయో అంతకు మాత్రమే అమ్మేవాడు. వారి స్థితిగతులు గుర్తించుకొని బీదవారుగా ఉంటే ఊరికే యిచ్చేవాడు. అనాడు తాను పస్తు పరుండేవాడు. ఈ సందర్భంలో ఒక చిన్న ఉదాహరణము. గ్రీసువారు యిక్కడున్నారు, 25 మంది. బెంగుళూరులో ప్లేనులో దిగారు. పెద్దలగేజి వీపుకు కట్టుకున్నారు. రెండు బుజాలపైనా నీరు బాటిల్సు తగిలించుకున్నారు. వారి భక్తే భక్తి. అక్కడనుంచి కాలినడకన 'ఓం సత్యసాయిబాబాయ నమః' అని ఒక్కొక్క అడుగు వేసుకుంటూ పుట్టపర్తికి వచ్చి చేరారు. వస్తూనే నేను దగ్గరకి వెళ్లి వారికి స్వాగతం

srisathyasai vahini.org

పలికాను. ‘కాళ్ళు నొప్పిగా ఉన్నాయా?’ అన్నాను. ‘అయ్యో యింకో పదిమైళ్లు అయినా నడుస్తాం స్వామీ! చాలా ఆనందముగా ఉంటున్నాది. యిది మాకు ఒక అవకాశం’ అన్నారు. ‘మేము కార్లో కూర్చొని వస్తే యీ నామము స్మరించిఉండేవారము కాము’ అని చెప్పారు. అందువల్లనే ప్రాచీనకాలములో ‘కష్టేఫలే’ అన్నారు. కష్టపడినప్పుడే ఫలము మనకు చిక్కుతుంది. అట్లులనే కబీరుకూడా ప్రతి సమయమునందు అడుగులు వేసేటప్పుడు ‘రాంరాం’ అంటూ నడిచేవాడు. ఇతని భక్తి ప్రపత్తులు దేశమంతా వ్యాప్తి అయిపోయింది. ఆ దేశపురాజు తెలుసుకున్నాడు. ‘పాపం కబీరు చాలా బీదవాడు. ఇతనికి ఎవరూ దిక్కులేరు, అనాథ. అట్టి అనాథునికి తీసుకుపోయి యీ పదార్థములివ్వండి’, అని పల్లకి నిండుకు తిను బండారములు నింపి కబీరు ఇంటికి పంపించాడు. నదికి వెళ్ళి స్నానము చేసి వచ్చి చూచాడు కబీరు. అది ఒక పెద్ద పల్లకి. నలుగురు మోసుకొని వచ్చారు. కావలసినంత సామాగ్రి అందులో నిండి ఉంటున్నాది. ఆశ్చర్యముగా విచారించాడు ఈ నలుగురిని. ఏమిటంటే ‘మా యింటిలో ఉండేది మేము యిద్దరమే! మీరు నలుగురు మోసుకుంటూ ఈ పల్లకిని తీసుకువచ్చారే, మేము యిద్దరం క్షేమముగానే ఉన్నాము కదా!’ నలుగురు మనుష్యులు మోసేది శవమును. మేము క్షేమంగానే ఉన్నామని రాజుగారికి చెప్పండి’ అన్నాడు. అప్పుడు ఆ బోయీలు ‘కాదు కాదు! కబీరు స్వామి! మీరు చాలా బీదవారు. అనాథులు. రాజుగారి ఆజ్ఞ యిదియే! ఆ అనాథునికి అందించండి అని రాజుగారు చెప్పారు’ అన్నారు. ఓహో! రాజుగారు అనాథునికి యివ్వమని చెప్పారా! మంచిది, నేను అనాథను కాదు. నాకు భగవంతుడు రాముడు నాథుడుగా ఉన్నాడు. నేను అనాథ కాదు. రాముడే అనాథుడు. అతనికి యింకొక నాథుడు లేడు. కనుక ఇవన్నీ తీసుకుపోయి అతనికే యిచ్చేయండి’, అన్నాడు కబీరు. చూచారా! ఆ పదములలో ఎంత అర్థము ఉంటున్నాది! జగత్తులో ఎవడూ అనాథుడు లేడు. అనాథుడు భగవంతుడొక్కడే! అందరికి ఒక్కొక్క master ఉంటున్నాడు. కానీ భగవంతునికి యింకొక master లేడు. అతను king కాదు, Kingmaker. అనాథుడు భగవంతుడొక్కడే! అనేకమంది అంటుంటారు, ‘స్వామీ! నన్ను అనాథను చేయవద్దండి’ అని. దానికి నేను ‘నీవుకాదు నాయనా అనాథ, నేను అనాథను. నీవు అనాథ అని చెప్పవద్దు’, అంటుంటాను.

## భగవంతుని నమ్మినవానికి ఏ లోటు ఉండదు

భక్తులు దైవముయొక్క తత్త్వమును, దైవముయొక్క యథార్థమును గుర్తించుకొనలేక అనేక విధములుగా అపోహ పడతారు, ఆవేశములోపల. కానీ, భగవంతుని నమ్మినవానికి ఏ విధమైన లోటు ఉండదు. మనయందున్న దివ్యత్వమనే జ్యోతి వెల్గాలనుకుంటే మొట్టమొదట ఈ రాగద్వేషములను దూరము చేయండి. ప్రేమతత్త్వమును అభివృద్ధి పరచుకోండి! అహంకార, మమకారములు ఉండకూడదు. ఒక చిన్న ఉదాహరణము. దీనికి నేనే చక్కని ఆదర్శము. ఎట్లా? మీరందరు కూర్చున్న దగ్గరే కూర్చోండి. నేనే నడచుకొని వచ్చి, నడుమువంచి, చేయిచాచి మీ దగ్గరనుండి లెటర్సు తీసుకుంటున్నాను. లేకపోతే నేను అహంకారముతో ఒకచోట కూర్చొని మీరు వచ్చి లెటర్సు యివ్వండి అంటే సరిపోతుంది కదా! కనుక, అహంకారము ఉండకూడదు. ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్లి చక్కగా ఆదర్శమునందించటమే స్వామి తత్త్వము. ఇన్ని వేలమంది, ఇన్ని ప్రదేశములనుంచి, యిన్ని వేలమైళ్లనుంచి వచ్చినవారు స్వామి దగ్గరకు రాలేరా? రాగలరు. కానీ, 'నాకు అహంకారము లేదు' అని నిరూపించే నిమిత్తమై నేను యీ విధమైన ఆదర్శమును మీకు బోధిస్తున్నాను. మీరు నావారు, వారు పైవారు అనే భావమేలేదు, నాకు. అందరూ నావారే! నేను మీ అందరివాడనే! ఈ సత్యమును ప్రతి భక్తుడు, ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలి. దీనినే గీతయందు 'మమాత్మ సర్వ భూతాంతరాత్మ' అందరియందున్న ఆత్మ, నేను ఒక్కటే అని చెప్పడం జరిగింది. 'అయితే ఎందుకు కనిపించకూడదు అందరికి?' అనుకుంటారు. ఒకరు దగ్గరగా ఉంటారు, ఒకరు దూరముగా ఉంటారు. ఈ ప్రాకృతమైన వ్యామోహములు వారిని చుట్టి కట్టిపెట్టటంచేత ఈ విధమైన దీనిలో మునిగిపోతున్నారు. అందులో యీనాటి యువకులకు ఉడుకురక్తము వేగంగా ప్రవహిస్తుంది. ఈనాటి మాటలు, ఆటలు, పాటలే వారికి మోజు, పోజు. ఈ మోజుకు ఈ పోజుకి విద్యార్థులు మరిగిపోవటంచేత పిచ్చి పిచ్చి మాటలు, పిచ్చి పిచ్చి ఆటలు యిష్టపడుతున్నారు. దైవత్వమంటే, దైవచింతనంటే, దైవప్రసంగములంటే, దైవభజనలంటే వారికి అంత సూటిగా చేరవు. కొంతమంది యీ చెవితో విని ఆ చెవితో వదిలేస్తారు. భోజరాజు పరిపాలిస్తున్న సమయంలో ఒక శిల్పి మూడు విగ్రహాలు తయారుచేసి తీసుకువచ్చాడు. మూడు ఒకే విధమైనవిగా చూడటానికి

srisathyasaivahinitam

ఉంటున్నాయి. అన్నీ సుందరంగానే ఉంటున్నాయి. మంత్రిని పిల్చాడు. 'మంత్రీ! ప్రయిజునందించటానికి ఏది సరైనది నీవు నిర్ణయించు' అన్నాడు. మంత్రి 'ప్రభూజీ! క్షమించండి ఐదు నిముషములలో వస్తాను', అన్నాడు. 'విగ్రహాలు యిక్కడుంటే బయటకు ఎందుకు పోవాలి. ఏ పని ఉంటున్నాది నీకు?' అనుకున్నాడు భోజరాజు. ఇంతలో మంత్రి లోపలకి వెళ్లి ఒక యినుపవైరు తీసుకువచ్చాడు. ఒక విగ్రహము చెవిలో వైరు పెట్టాడు. రెండవ చెవినుండి బయటకు వచ్చింది, ఆ వైరు. **worst** అని చెప్పాడు. తరువాత రెండవ విగ్రహముయొక్క ఒక చెవిలో పెట్టాడు. అది నోటిలోనుండి బయటకు వచ్చింది. దీనికి 2nd prize అన్నాడు. మూడవ విగ్రహము చెవిలో పెట్టాడు. లోపలకు పోయింది. దీనికే 1st prize ఇవ్వాలి అన్నాడు. అనగా ఏమిటి? విన్న విషయములు లోపలకు తీసుకోటమే 1st prize. విన్న విషయములు చిలుక పలుకలవలె మాటలతో చెప్పటమే 2nd prize. ఈ చెవితోవిని ఆ చెవితో విడిచిపెట్టడం worst. ఈ నవీన కాలమందు మరల మరల ఉచ్చరిస్తారు. చిలుకపలుకులవలె. మరి కొంతమంది విన్న విషయమును లోపలకు తీసుకొని జీర్ణింపచేసుకుంటారు. దీనికి ఏమి భేదము? ప్రకృతి భేదమా? కాదు. ప్రకృతి, ప్రకృతిగానే ఉంటున్నాది. నీ యిష్టములో ఉంటున్నాది, ఈ మార్పు. ఈ యిష్టము ఎక్కడనుంచి వస్తున్నాది? సంగదోషమునుంచి చేరుతున్నాది.

### సమాజక్షేమములో మన క్షేమముంటున్నాది

ప్రతి వ్యక్తి నేను బాగుండాలి, నా కుటుంబము బాగుండాలి, అని కోరుతుంటారు. ఇది ఎంత పిచ్చితనము! ఓ పిచ్చివాడా! నీవు బాగుండాలి, నీ కుటుంబము బాగుండాలి అంటున్నావు. నీవు ఎక్కడున్నావు? ఎవరిపై ఆధారపడిఉన్నావు? నీవు నీ కుటుంబముపై ఆధారపడి ఉన్నావు. నీ కుటుంబము ఎవరిపై ఆధారపడిఉంది! సమాజముపై ఆధారపడిఉంది. సమాజము బాగుంటేనే కుటుంబము బాగుంటుంది. కుటుంబము బాగుంటేనే నీవు బాగుంటావు. కాబట్టి నీవు, నీ కుటుంబమే కాదు, సమాజము అంతా బాగుండాలి. కనుక, సంఘక్షేమమును మనం ఆశించాలి. సంఘసంక్షేమములో మన క్షేమముంటున్నాది. కనుకనే 'లోకాః స్సమస్తా సుఖినోభవంతు' అన్నారు. అందరు

srisathyasaivachanamrutam

సుఖముగా ఉండినప్పుడే మనము సుఖంగా ఉండగలము. వేదాంతప్రబోధలు యింత పవిత్రమైన మూల సూత్రాన్ని బోధిస్తూవచ్చినాయి. కానీ, ఈనాడు దురదృష్టవశాత్తు బోధకులు సరియైన బోధలు చేయటంలేదు. వినేవారికి సరియైన interest లేకుండా ఉంటున్నాది. ఎక్కడ in-trust ఉంటుందో అక్కడే మనకు interest లభ్యమవుతుంది. ఈనాడు in-rest, in-trust కావాలి. అదియే మనకు కావాలి; in-rest అనగా సోమరిపోతుగా ఉంటున్నాడు. ఇది మన పనికాదు. మంచి సంగములో మనము చేరాలి. Tell me your company, I shall tell you what you are

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః**

Good company. ఏమిటి good company అంటే? విషయసంబంధమైనవి ఏమాత్రము పెట్టుకోకుండా దైవత్వమును అధికంగా చింతించటం good అన్నారు. Every good work is God work అన్నారు. ఎట్లా? Good. నీవు చక్కగా విచారణచేసి ఈ ప్రపంచమంతా ఏమిటి? ఏమీలేదు

**పునరపి జననం పునరపి మరణం**
**పునరపి జననీ జఠరే శయనం**
**ఇహసంసారే బహుదుస్తారే**
**కృపయా పారే పాహి మురారే** **॥భజ॥**

పుట్టటం చావటం పుట్టటం చావటం ఇది ఏమీలేదు. రావటంపోవటం, రావటంపోవటం! అందుకోసమే దీనికి 'జగత్' అని పేరు పెట్టారు. జ-గత్. రావటంపోవటం. రావటం పోవటమే ఉంటున్నాది. ఏమీలేదు ఇందులో. ఇదంతా వట్టి zero. కాబట్టి ఒక జీరో నీవు మైనస్ చేయి. Good లో ఒక జీరో తీసివేస్తే God అయింది. జగత్తు ఉండినంతవరకు Good అవుతుంది, జగత్తు కొంతవరకు దూరంచేస్తే God అయిపోతుంది. జగత్తును నీవు విడవనక్కరలేదు. నీ కుటుంబము నీవు పోషించుకో, నీ కర్తవ్యము నీవు నిర్వర్తించుకో, నీ ఆఫీసు పని నీవు చేసుకో! కానీ, అన్నీకూడను దైవార్పిత భావముతో చూచుకో.

srisathyasaivachanamrutam

## తెలిసి భగవచ్చింతన చేయి

Everything is God's work. అందువల్లే మనము ఏమి చేసిన Work will be transformed into worship. అక్కడ worship లేకపోతే నీవు work కూడా సరిగా చేయలేవు. నీకు office work ఉంటున్నాది. ఆఫీసు work పైన ఒక విధమైన worship లేకపోతే office work అలక్ష్యం చేస్తావు. Worship అంటే కేవలం భగవంతుని worship చేయటంకాదు workను కూడా worship చేయాలి. ప్రతి workను, ప్రతి విషయాన్ని మనం worship చేయాలి. అప్పుడే దాని ఫలితము మనకు చక్కగా లభ్యమవుతుంది. ఒక పని చేస్తూ దానిపై మనస్సు పెట్టకుండాపోతే ఆ పని పాడైపోతుంది. కనుక మనం workపై worship చేయాలి. తెల్లవారి మొదలు రాత్రి పరుండునంతవరకు ప్రతి ఒక్క పని worship. పొట్టకోసం తింటున్నాం. అదీ worship.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్**
**బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా.**

అంతా బ్రహ్మార్పణం. బ్రహ్మార్పణం చేయక నీవు తిన్న అన్నం ఎట్లా జీర్ణమై పోతుంది? అక్కడ లోపలనున్న

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.**

నీ కడుపులో నేను వైశ్వానరుడిగా నుండి, దాన్ని చక్కగా యిడ్లిపిండి రుబ్బినట్లుగా రుబ్బి సర్వాంగములకు సప్లైచేయటంవలన నీవు తిని తిరిగి సంతుష్టిగా జీవించగలుగుతున్నావు. లోపల జీర్ణింపచేసి సప్లై చేసేవారు ఎవరు? దీనికి నీవు ఏమి ప్రయత్నంచేస్తున్నావు? ఏమీ చేయటంలేదు. గుండె కొట్టుకుంటున్నాది. దీనికి నీ ప్రయత్నం ఏమిటున్నది? అదే దైవ సంకల్పము. అయ్యో! నా సంకల్పములేక ఎట్లా జరుగుతుంది అని అహంకారి విఱ్ఱవీగుతాడు. నీ blood circulation లో నీ ప్రయత్నం ఏమిటున్నాది? నీ pulse లో నీ ప్రయత్నం ఏమిటున్నాది. నీది ఏమీలేదు. అంతా దైవముదే. ఆ దైవమే గుండెను ఆడిస్తున్నాడు. Lungs లో ఆక్సిజను చేరుస్తున్నాడు. ఆక్సిజనుతో శుభ్రపడిన రక్తము సర్వాంగములకు సప్లై చేస్తున్నాడు. Import, export రెండూ తానే చేస్తున్నాడు. ఆ దైవత్వము

sri sathyasai vachanamrutam

లోపలలేక నీవు ఏ పనీ చేయలేవు. ఆ దివ్యత్వమును మొట్టమొదట మనం గుర్తించుకోవాలి. మనం నమ్మినా నమ్మకపోయినా తన పని తాను చేస్తున్నాడు. అయితే నమ్మిచేస్తే నీకు మరింత ఆనందముంటుంది. 'తెలిసి మ్రొక్కు, చూసి తొక్కు', అన్నారు. మనము తెలిసి దానిని అనుభవించాలి. అగ్ని వుంది. తెలుసుకుంటే దానిపై చేయిపెట్టము. తెలుసుకోకుండా పెట్టినప్పుడు కాలిపోతుంది.

**తెలిసి రామచింతన చేయవే ఓ మనసా**
**తెలిసి రామచింతన చేయవే**

నీవు తెలిసి భగవచ్చింతన చేయి. ఎట్లా? సర్వము తనయందే ఉంటున్నది. దైవాజ్ఞలేక ఏదీ జరుగదు.

**మంచిపని చేయటమే మానవత్వముయొక్క ప్రధాన లక్ష్యము**

**చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో**
**ప్రేమమీర వెలసియుండె బిరుదు వహించిన**
**సీతారామా నన్ను బ్రోవరా, రామా నన్ను బ్రోవరా!**
**మెప్పులకై కనరావు అప్పుపడక విఙ్ఞవీగి**
**తప్పుపనులు చేయకుంటె త్యాగరాజ వినుత**
**సీతారామా నన్ను బ్రోవరా, రామా నన్ను బ్రోవరా!**

ప్రతి ఒక్కటి దైవముచేతనే పరిపూర్ణ స్వరూపాన్ని పొందుతున్నాయి. ఈ జ్ఞానమును పొందే నిమిత్తమై విద్య కావాలి. ఏది జ్ఞానమును బోధిస్తుందో అదే విద్య. ఏ జ్ఞానము? పదార్థజ్ఞానమా? పదార్థజ్ఞానమునందు reaction ఉంటున్నాది. అన్నింటియందు reaction, reflection, resound ఉంటున్నాది. ఇది ఒక పదార్థము. టేబుల్‌ని కొట్టినప్పుడు ఆ..! అనుకుంటున్నాము. 'నేను టేబుల్‌ను కొట్టినాను' అని చెబుతున్నాము. కాదు, అంటే ఆ టేబుల్‌కూడా నిన్ను కొట్టింది. ఇది చక్కగా పిల్లలు అర్థము చేసుకోవాలి. టేబుల్‌కూడా నిన్ను కొట్టింది. నీవు మాత్రమే టేబుల్‌ని కొట్టటంకాదు. అక్కడ reaction, reflection, resound వస్తున్నాయి. మనము ఏమి చెప్పుతామో, ఏమి చేస్తామో, ఏమి తలుస్తామో అది అంతా

srisathyasaivachanamrutam

reaction, reflection, resound గా వస్తుంది. కనుకనే మంచి చేసి, మంచి చూచి, మంచి విని, మంచి తలంచి, మంచి అనుభవించు. మంచి పని చేయటమే మానవత్వముయొక్క ప్రధానలక్ష్యము. మానవుని లక్ష్యము ఏమిటి? మానవుడై పుట్టి గొప్ప తెలివితేటలు కల్గిఉండి మేధాశక్తిగా భావించి, గొప్ప విద్యావంతుడని విశ్వసించి. గొప్ప ఉద్యోగములో పని చేస్తూ, కేవలం సామాన్యమైన పశుపక్షిమృగాదులవలె ప్రవర్తిస్తుంటే ప్రయోజనం ఏమిటి? నీకున్న ఆకలి చిన్న చీమకుకూడా ఉంటున్నది. నీకున్న భయము ఆ చిన్నచీమకుకూడా ఉంటున్నాది. నీకున్న కోరికలు పశువులకుకూడా ఉంటున్నాయి. బజార్లో పోయే కాకులకు, గ్రద్దలకు, కుక్కలకు, నక్కలకు, కోతులకు అన్నింటికి ఉంటున్నాయి, ఈ కోరికలు.

### ప్రతి ఒక్కరు హృదయ తత్త్వమును గుర్తించాలి

మానవునిగా పుట్టి కేవలం పశుపక్షిమృగాదులవలె వాంఛలలో మునిగిపోతే నీయొక్క ప్రత్యేకత ఏమిటి? ఒకానొక సమయములో జనక మహారాజు పెద్ద యాగము చేస్తున్నాడు. పండితులకు ఆహ్వానము పంపించారు. గొప్ప పేరు పొందిన పండితులు అక్కడ ప్రవేశించారు. కవులందరు ప్రవేశించారు. వేదశాస్త్రపురాణఇతిహాసముల ప్రమాణములను నిరూపించే ధీశక్తి కలవారు వచ్చారు. అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఆ సభలో మధ్యలో ఒంకరటింకర దేహముతో ఒక వ్యక్తి నడచుకుంటూ వస్తున్నాడు, రాజు దగ్గరకు. అందరిదృష్టి అతనిపై పడింది. ఏదో సామాన్యంగా వస్తే పరవాలేదు. శరీరమంతా ఒంకరటింకరగా ఉంటే విచిత్రంగా ఉంటుంది. తక్షణమే అందరు నవ్వారు. ఆ రూపమును చూస్తే అందరికి నవ్వు వచ్చింది. వారందరు ఎంత నవ్వినారో ఆ వ్యక్తికూడా అంతకు పదింతలు 'ఆహా!' అని నవ్వాడు. రాజు చాలా ఆశ్చర్యపడ్డాడు. తరువాత 'దయ చేయండి' అని ఆహ్వానించి ఉన్నతాసనమిచ్చాడు. 'పండిత మహాశయా! వీరందరు నవ్వటంలో ఒక కారణం ఉంటున్నాది. ఎందుకనగా, మీ దేహము చాలా వంకరలు తిరిగింది. కాని, మీరు ఎందుకు నవ్వారో తెలియడంలేదు. మీ పేరు ఏమిటి?' అని ప్రశ్నించాడు. 'నా పేరు అష్టావక్రుడు' అన్నాడు. అనగా ఎనిమిది వంపులు తిరిగింది దేహము. దీనిని చూచి పండితులు నవ్వారు. అప్పుడు అష్టావక్రుడు లేచాడు. 'ప్రభూ! మీరు

sri sathyasai vachanamrutam

పండిత సమావేశమనే వార్త నాకు పంపటంచేత నేను యిక్కడికి వచ్చాను. దీనిలో అందరూ పండితులే ఉంటారనే పిచ్చి భావముతో వచ్చాను. కానీ యిక్కడ ఒక్కడైనా పండితుడు లేడు అంతా చర్మకారులుంటున్నారు వారిని చూచి నవ్వాను', అన్నాడు. చర్మకారులంటే చెప్పులు కుట్టేవారని అర్థము. 'ఎందుకింత పెద్దమాటలంటున్నావు? ఈ పండితులందరు చెప్పులు కుట్టేవారా!' అని అడిగాడు, రాజు. 'చెప్పులు కుట్టేవానికే చర్మము సంగతి తెలుస్తుంది. వీరు నా చర్మము చూస్తున్నారు. నా హృదయము చూడటంలేదు. నా పవిత్రతను చూడటంలేదు. ఇలాంటి చర్మకారులను ఆహ్వానించారా అని నాకు నవ్వు వచ్చింది', అన్నాడు. ఒకొక్కరి దృష్టి ఒక్కొక్క రకముగా ఉంటుంది. 'ముండే ముండే మతిర్ భిన్నః'. ప్రపంచములో యిట్టి వికృతమైన భావములతో జీవితము జరుగుతుంది. ప్రతి ఒక్కరు హృదయతత్త్వమును గుర్తించాలి. గొప్ప పండితులనుకుంటారు. గొప్ప కవులనుకుంటారు.

**భగవంతుడు భావప్రియుడేగాని బాహ్యప్రియుడు కాదు**

భగవంతుడు ఈ పాండిత్యమును, ఈ కవిత్వమును ఏమాత్రము చూడడు. భగవంతుడు భావప్రియుడేగానీ బాహ్యప్రియుడు కాదు. 'అయ్యా! ఎంతమందికి నీవు అన్నదానము చేశావు' అని అడిగితే 'నేను ఐదువేలమందికి అన్నదానము చేశాను. రెండువేలమందికి చీరలిచ్చాను', ఇలా చెప్పుకుంటారు. 'ఛీ! ఛీ! ఐదువేలమందికి అన్నం యివ్వటం, రెండువేలమందికి చీరలివ్వటం ఇవన్నీ income tax officer దగ్గర చెప్పు. కానీ నా దగ్గర చెప్పనక్కరలేద'ంటాడు, భగవంతుడు. 'నాకు చూపవలసినది నీ హృదయ పవిత్రతయే!' అని చెపుతాడు. కనుక హృదయ పవిత్రతను చూచేవాడు భగవంతుడుకానీ దీన్ని దాన్ని చూచేవాడుకాదు భగవంతుడు. ఇదీ అష్టావక్రుడు ఈ పండితులకు, ప్రజలకు చక్కగా బోధించిన బోధ. నా పాండిత్యము చూడమను. పండితుడనగా ఎవరు? 'పండితా సమదర్శినః'. ఎక్కడుంది సమదర్శనం? పెద్దశాలువలు కప్పుకొని, కంకణాలు వేసుకొని వచ్చి కూర్చున్నారు ఫొటోకోసం. ఇది కాదు పాండిత్యము. నీ హృదయము విప్పి జగత్తుయొక్క సత్యమును నిరూపించి దైవత్వముయొక్క నిత్యమును చాటాలి. అదే నిజమైన పాండిత్యము. అలాంటి పాండిత్యమును మనము ఈనాడు ప్రకటించాలి,

srisathyasaivachanamrutam

వికసింపచేయాలి, ప్రచారప్రబోధలు సల్పాలి.

**దైవవిశ్వాసము లేనిదే దేనినీ సాధించలేరు**

విద్యార్థులారా! మీరు 'O' grade తెచ్చుకోండి. మంచిగా చదవండి. Gold medal తీసుకోండి. నాకు చాలా ఆనందమే! కానీ దానితోబాటు దైవ విశ్వాసము పెంచుకోండి. ఆ విశ్వాసములేనిదే దేనినీ సాధించలేవు. ఇతరమైనవి అన్నీ సాధించి ఏమి ప్రయోజనము? ఇవన్నీ వ్యర్థమైనవే! అన్నింటితోబాటు దైవానుగ్రహము పొందినప్పుడు నీవు సార్థకత పొందుతావు. ఎన్ని ఉండి ఏమీ ప్రయోజనములేదు.

**తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు**
**కంఠమాలలవేవి కానరావు**
**మంచి ముత్యపు సరుల్ మచ్చునకును లేవు**
**మేల్మి బంగరుదండ మెడకు లేదు**
**రత్నాల హారముల్ రంజిల్లగా లేవు**
**పచ్చలు కెంపులు పరగ లేవు**
**వజ్రాల హారముల్ వర్థిల్లగా లేవు**
**గోమేథికంబులు తోడులేవు**
**కలదు కలదొక్క మాల మీ కంఠమందు**
**పూర్వజన్మాలకర్మల పొందుపరచి**
**మంచిదైనను చెడుగైన త్రుంచకుండ**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల!**

ఆ మాల ప్రతి ఒక్కరి కంఠమునందు ఉంటున్నాది. కానీ అది కనిపించదు కనిపించే మాల ఒకటున్నది. ఆ మాల మంచిమాలగా ఉండాలి. సుగంధ పుష్పమాలగా ఉండాలి. దుర్గంధపుమాలగా ఉండకూడదు. ఈ విషయవాసనలు సాధ్యమైనంతవరకు చల్లబరచుకోండి. వైరాగ్యము ఎట్లా రావాలి? చాలామంది అనుకుంటుంటారు, 'దీనిపైన



srisathyasaivachanamrutam

ఆశపోతుంది, దానిపైన ఆశపోతుంది' అని. వీటన్నిటిపై వైరాగ్యము అవసరము. నిజంగా మీరు విద్యావంతులు, మనుష్యులు, దైవముపైన భక్తిగలవారలు అనే భావమే దృఢముగా ఉంటే ఈ ఒక్క వైరాగ్యముతో నీ మనస్సు మారిపోతుంది. ఏమిటి వైరాగ్యమంటే? కక్కిన అన్నమును తిరిగి వారు భుజించరు. ఈ కక్కిన అన్నము ఏవిధంగా త్యజిస్తామో అట్లనే విషయవాసనలు త్యజించాలి. ఈ విషయవాసనలువస్తే 'ఛీ! యిది నేను కక్కిన అన్నము దీన్ని చూడకూడదు', అని భావిస్తే దానిని చూడటమే మనకు ఇష్టముండదు. ఇక దాన్ని ఎట్లా భుజిస్తావు? వైరాగ్యమంటే కక్కిన అన్నమును విస్మరించినట్లుగా నీవు తుచ్ఛమైన భావములు విసర్జించు. ఏదైనా విషయవాసనవస్తే, పిల్లలు చాలా జాగ్రత్తగా వినాలి. ఈ వయస్సు పిల్లలు చాలా చెడ్డ చెడ్డవంతా చూడటానికి ప్రయత్నిస్తారు. చెడ్డవి తలచటానికి ప్రయత్నిస్తారు. ఆ ఆలోచనలు వస్తే 'ఛీ! యిది నేను కక్కిన అన్నము. దుర్గంధము. చాలా చెడ్డది. కడుపులో ఉండటానికే యిష్టములేక కక్కివేసినాను. అలాంటి దానిని నేను ఎట్లా ఆశించగలను?' అని విచారణ చేయాలి. ఇది నిజమైన వైరాగ్యము. అప్పుడే మంచి పవిత్రమైన మార్గములో ప్రవేశిస్తావు. అలా పవిత్రమైన మార్గము వచ్చినప్పుడే దైవము నిన్ను ఆనందముగా దగ్గరకు చేర్చుకుంటాడు. అంతకంటె సన్నిధి మరొకటిలేదు. అంతకంటే పెన్నిధి మరొకటిలేదు. అదియే జీవితానికి నిజమైన ఆశయము. మానవుని purpose of Life అదే! మానవజన్మ వచ్చినందుకు దానిని సాధించాలి. మంచిపేరు తెచ్చుకోవాలి.

**(తేదీ 22-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini